# వివాహ భోజనంబు

**కథ**

కళ్యాణ మంటపం లైట్ల వెలుగులో ధగధగా మెరిసిపోతోంది. రకరకాల ఖరీదైన బట్టలు వేసుకున్న చిన్న పిల్లలు, లేటెస్ట్ ఫేషన్ డిజైన్ డ్రెస్‌లు, చీరల్లో అమ్మాయిలు, ఒంటినిండా నగలు, ఖరీదైన పట్టుచీరల్తో కొంచెం పెద్ద వయసు స్త్రీలు, రకరకాల సూట్లలో ఉన్న మగ వాళ్లు- గుంపులు గుంపులుగా చేరి, కబుర్లు చెప్పుకుంటున్నారు. బయట బారులు తీర్చినట్లు పార్క్‌చేసిన వాహనాలని చూస్తేనే తెలుస్తుంది- బాగా కలవారింట్లో పెళ్ళి అని. బేండు వాయిద్యాల హోరు ఆగేసరికి లౌడ్ స్పీకర్లలోంచి పాటలు..చాలా హడావుడిగా ఉంది. పెళ్ళి మంటపాన్ని రంగురంగుల చెమ్కీలు, పువ్వులు కలిపి కళ్ళు చెదిరేలా అలంకరించేరు. వీడియోగ్రాఫర్లు, ఫోటోలు తీసేవారు చుట్టూ ఉన్నారు. పెళ్ళి తంతు ఏం జరుగుతోందో కూర్చున్నవారెవరికీ తెలీడం లేదు. అందుకే అంతా కబుర్లలో పడ్డారు.

ఆ పెళ్ళికి వచ్చిన అరయ్యేళ్ళు పైబడ్డ మూర్తిగారు ఎవరితోనూ కలవకుండా ఆలోచనల్లో పడ్డారు. ఈ హడావుడి, చెవులు బద్దలయ్యేలా బేండుగోల సినిమా పాటలు ఏ మాత్రం నచ్చలేదాయనకి. ఎవరేం మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదు. వచ్చినవాళ్ళని పలకరించడానికి పెద్దవాళ్ళెవరూ కనిపించలేదు. ద్వారం దగ్గర ఓ రెండు టేబిల్స్ చెరోవేపూ వేసి వాటిపై ఓ దానిమీద ట్రేలో పసుపు, కుంకం, గంధం వగైరాలన్నీ ఉంచి, ఓ ఇద్దరమ్మాయిలు అక్కడ నిలచున్నారు. వచ్చినవారి ముందుకి ట్రేతోసి, తీసుకోమని అంటున్నారు. ఇంకోవేపు టేబిల్ దగ్గర ఇద్దరు అబ్బాయిలున్నారు. వచ్చినవాళ్ళ చేతిలోని ప్రెజంటేషన్ వాళ్ళే తీసుకుని, నోట్ చేసుకుంటున్నారు.

పెళ్ళికి వచ్చినవాళ్ళు తిరిగి వెళ్ళేటప్పుడు ఆడవారికి పసుపురంగు కవరు, మగవారికి గులాబిరంగు కవరూ అబ్బాయిలే ఇస్తున్నారు. పాతకాలం పద్ధతులన్నవి ఎక్కడా కనిపించలేదు. అన్నీ యాంత్రికంగా జరిగిపోతున్నాయి.

ఒంటరిగా కూర్చొని ఆలోచిస్తున్న మూర్తిగారి దగ్గరకి వచ్చాడో వ్యక్తి.

''ఏం మూర్తీ! బాగున్నావా? ఒక్కడివే ఇక్కడే ఉండిపోయావేం? ముహూర్తం దగ్గర పడుతోంది. అక్షింతలు వెయ్యవా?'' అంటూ.

మూర్తి నవ్వి, ''ఓ! శంకరం నువ్వా. ఆ జనంలోకి మనం వెళ్ళగలమా? అయినా అలా తోసుకుని నేను వెళ్ళలేను'' అన్నాడు.

శంకరం, ''నిజమే! అసలు పెళ్ళి తంతు ఏం జరుగుతోందో కన్పిస్తుందా? మంత్రాలు వినిపిస్తాయా? ఆ తరువాత ఎప్పుడో వీడియోలో చూసేస్తే సరి'' అన్నాడు.

హఠాత్తుగా బేండు వాయిద్యాలు గట్టిగా మ్రోగడంతో, మూర్తి, శంకరం తలతిప్పి ఎదురుగా చూసేరు. కూర్చున్న వాళ్ళంతా బర్రుమని శబ్దం అయేలా కుర్చీలు వెనక్కి తోస్తూ ఒక్కసారిగా మంటపం వైపు దూసుకుపోతున్నారు.

''ముహూర్తం అన్నమాట!'' అనుకున్నారిద్దరూ.

కొద్దిసేపట్లో సద్దు మణిగింది.

ఈసారి జనం అంతా మంటపానికి ఎడంవేపున్న ద్వారం వైపునకు కదిలేరు. అక్కడా హడావుడే.

''ఏంటి హడావుడి? అక్కడేం ఉంది?'' అని మూర్తి శంకరాన్ని అడిగేడు.

''భోజనాలయ్యా బాబూ! బఫే డిన్నరు'' అన్నాడు శంకరం.

''అదేంటీ?'' అంటున్న మూర్తితో, ''నువ్వు మరీనూ! ఆ పల్లెటూరు వదిలి ఈమధ్య సిటీల్లో పెళ్ళిళ్ళకి వచ్చినట్లు లేదు. అందుకే నీకు అంతా కొత్తగా ఉంది. అయినా ఇప్పుడంతా ఇదే ఫేషన్. తొందరగా అన్నిపన్లూ అయిపోతాయి. తెల్లవారేసరికి ఎక్కడివారక్కడికి వెళ్ళిపోతారు.''

మూర్తికి నవ్వొచ్చింది.

''ఇదేదో జాతరలా ఉందికానీ, పెళ్ళిలా ఉందటయ్యా? ప్రతీచోటా జనాలు ఎగబడిపోతున్నారు. ఇదేం పద్ధతి, నాకు నచ్చలేదు'' అన్నాడు, సీరియస్‌గా.

''నీకు నాకు నచ్చడం ఎవరిక్కావాలి? ఎవరిష్టం వాళ్ళది. రోజులు మారుతుంటే వాటితోపాటు మనం కూడా మారాలి కదా? ఎన్ని మార్పులు రావడం లేదూ? ఇదీ అంతే...సరేకానీ, భోంచేసి పోదాం. వస్తావా?'' అని అడిగేడు శంకరం.

ఇద్దరూ అటువైపు కదిలేరు. పెద్ద పెద్ద లైన్లు. ఎక్కడా ఖాళీయే లేదు. లైన్లో ఒక్కొక్కరి చేతుల్లోనూ ప్లేటు, స్పూను. క్యూ నెమ్మదిగా కదుల్తోంది. జైల్లో ఖైదీలు గుర్తొచ్చారు మూర్తికి.

అన్నీ వేయించుకున్నవాళ్ళు ఎక్కడ పడితే అక్కడ నుంచునీ, అటూ ఇటూ తిరుగుతూ కబుర్లు చెప్పుకుంటూ తింటున్నారు. మధ్యలో ఏదైనా కావాలంటే క్యూలో జనంపై నుండి చేత్తో ఎంగిలి ప్లేటు పట్టుకుని, లోపలికి దూరి వేయించుకుంటున్నారు.

ఎవరో ఒకామె సాంబారు కోసం వెళ్ళి, వేయించుకుని వస్తోంది. లైన్లో ఉన్న మరో స్త్రీ ''ఏయ్ రాధా, అప్పుడే భోజనం అయిపోతోందా..పట్టుచీర కొత్తదా'' అంటూ ముందుకి జరిగింది.

అంతే. ఆ రాధ కొత్తపట్టుచీర పాడైపోతుందని పయ్యారంగా పట్టుకుందేమో, సాంబారు ప్లేటు కాస్త ఒరిగింది. అసలే పింగాణీ ప్లేటు బరువు, వేడివేడిగా సాంబారు కాస్తా పట్టుచీర మీద పడింది. ఒక్క గావుకేక పెట్టి ప్లేటు వదిలేసిందామె. ఆ ప్లేటు తనని పట్టుచీర గురించి అడిగినామె కాలుమీద పడింది.

ఆమె కెవ్వుమని అరిచింది. ''ఇదేమే? తిన్న తిండంతా ఏమయిపోయిందే? నా కాలు పచ్చడి చేసేవు?'' అంది కోపంగా. ఆమె గాభరాగా వెనక్కి జరిగింది. అప్పుడే అన్ని పదార్థాలు వేయించుకుని వస్తున్న మరో పట్టుచీర శాల్తీకి తగిలిందామె. ఆమె గాభరాగా వెనక్కడుగు వేసింది. ఆమె వెనకే నించుని, అన్నీ వేయించుకుని బయటికి రాబోతున్న ఓ ఫుల్ సూట్‌వాలా చేతిలోని ప్లేటు అంచు ఆమె మోచేతికి గట్టిగా తగిలింది.

''అబ్బా!'' అంటూ అరిచి, తన ప్లేటు జార్చేసిందామె. ఆ ఫుల్ సూట్‌వాలా చేతిలోని ప్లేటూ తిరగబడ్డం, అదంతా అతని బట్టలమీద పడ్డం...అంతా క్షణాల్లో జరిగింది.

అంతే. అసలే ఎందుకో చిరాగ్గా ఉన్నతను దీంతో మండిపడ్డాడు. చేతిలోని ప్లేటుని విసిరేసి, గట్టిగా అరిచేడు.

''ఏమ్మా! కళ్ళు కనబడ్డం లేదా? వాటీజ్ దిస్ నాన్సెన్స్..'' అంటూ.

''అదిగో! కనకం నన్ను తోసింది. మీరు అనవసరంగా మాట్లాడకండి. మీ ప్లేటుతో నన్ను కొట్టింది చాలక, పైగా నన్ను తిడతారా? అసలూ, ఇది ఆడవాళ్ళ లైనయితే మీరిందులోకి ఎందుకొచ్చినట్లు? ఆడవాళ్ళు ఎక్కడుంటే అక్కడ తయారా? మంచీ మర్యాదా అక్కర్లేదా? అక్కడ చేంతాడంత లైనుంటే ఇక్కడికెందుకొచ్చినట్లు?'' అంటూ రెచ్చిపోయిందావిడ.

''అక్కడ చేంతాడంత లైనుండబట్టే ఇక్కడి కొచ్చేను. అయినా నా ఇష్టం'' అతనూ అరిచేడు. చూస్తుండగానే అక్కడంతా రసాభాస అయింది. వడ్డిస్తున్నవాళ్ళు బిక్కచచ్చిపోయేరు. కొందరు అతనికి నచ్చచెప్పి బయటికి లాక్కొచ్చేరు. పట్టుచీరలు పాడయిన ఆడవాళ్ళు ఇంకా తిట్టుకుంటూనే ఉన్నారు.

విషయం తెల్సిన పెళ్ళిపెద్దలు ఓ ఇద్దరు గబగబా అక్కడికి వచ్చి, అందరికీ క్షమాపణలు చెప్పుకుని, వేరే ప్లేట్లలో భోజనం మళ్ళీ ఇవ్వబోయారు. కానీ, ఎవ్వరూ తినలేదు.

''ఇచ్చిన మర్యాద చాల్లెండి. కడుపు నిండిపోయింది'' అంటూ విసురుగా వచ్చేసారు.

సూట్‌వాలా పెళ్ళికొడుక్కి కజిన్‌ట. ఆడపెళ్ళివారి మర్యాదలిలా ఉన్నాయి. ముక్కూ, మొహం తెలీని ఆడవాళ్ళచేత తనని తిట్టించి, అవమాన పర్చేరంటూ గొడవ మొదలుపెట్టేడు.

ఈ సీనంతా చూస్తున్న మూర్తిగారికి నవ్వు, చిరాకు వచ్చేయి. ''అయినా పశువుల్లాగ ఎక్కడపడితే అక్కడ నుంచుని ఆ తిండేమిటి? ఆ గొడవేమిటి? శుభ్రంగా ఒక చోట వడ్డించక?'' అన్నాడతను.

అసలే అతనికి మహా చికాగ్గా ఉంది. ఇలాంటి భోజనాల సీను అతనెప్పుడూ చూడలేదు.

శంకరం నవ్వేసేడు.

''పదవయ్యా బాబూ! లోపల వేరేగా వడ్డనలు కూడా ఉన్నాయిట. ఆ బఫే డిన్నరు మనకొద్దులే. శుభ్రంగా కూర్చుని భోంచేద్దాం. పద'' అంటూ లోపలికి తీసికెళ్ళేడు.

అక్కడా అంతే. బాగా హడావుడిగా ఉంది. ఏ కుర్చీ ఖాళీగా లేదు. ఇద్దరూ ఓ పక్కగా నిల్చుని, తమ చిన్ననాటి కబుర్లు చెప్పుకోసాగేరు.

''అవునయ్యా శంకరం! ఏమిటయ్యా ఈ పద్ధతులు అవీనూ! మన రోజుల్లో పెళ్ళిళ్ళు ఇలా ఉండేవా? ముచ్చటగా మూడురోజులు ఎంత చక్కగా జరిగేవి?''

''ఆ! కొబ్బరాకుల పందిళ్ళక్రింద, తాటాకు చాపలమీద కూర్చుని విసనకర్రలతో విసురుకునేవాళ్ళం. ఆ చల్లదనం ఇప్పుడు లేదులే. ఎన్ని ఫేన్లున్నా వేడిగా లేను. కరెంటుపోతే ఇంతే సంగతులు. జనరేటరు మోత ఒకటి'' అంటూ నవ్వేడు శంకరం.

''ఎండకీ, వానలకీ ఈ రంగురంగుల అతుకుల గుడ్డముక్కల షామియానాలు ఆగవు'' మూర్తి అన్నాడు. ''చక్కా ఇంటిముందు వాకిలి అలికి శుభ్రం చేసి, నలుగుపిండితో పచ్చగా ముగ్గులు పెట్టి, మామిడాకుల తోరణాలు కడితే ఎంత కళగా ఉంటుంది?''

''అగ్గిపెట్టెల్లాంటి ఎపార్టుమెంట్లు, ఇళ్ళే ఇక్కడ. అవన్నీ ఎలా కుదురుతాయి? మామిడాకు తోరణాలు లేవు, మామిడిచెక్క పెళ్ళిపీటలూ లేవు. అల్లుణ్ణి కుర్చీలోనే కూర్చోబెట్టి కాళ్ళు కడగడం వచ్చింది'' అన్నాడు శంకరం.

''ఏదో ఒహటి! పెళ్ళి తంతు కళ్ళ వేడుకగా చూద్దామంటే ఈ వీడియో గ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్లు ఏదీ చూడనివ్వరు''

''ఆ భోజనాలు అంతేకదా! విస్తళ్ళు వేసి, నీళ్ళు జల్లి ఓ పద్ధతి ప్రకారం వడ్డించడం, ప్రతి ఒక్కరినీ పలకరించి, అందరికీ అన్నీ అందుతున్నాయో లేదో చూడ్డం, ఇంకొంచెం కూరవేయించుకోండి, ఈ ఒక్కబూరె నాకోసం తినండి అంటూ ఆప్యాయంగా కొసరి కొసరి తినిపించడం..అబ్బే..'' మూర్తికి అడ్డు తగిలేడు, శంకరం.

''సర్లే! భోజనాలు పూర్తికాగానే, పెళ్ళిపెద్ద అందరికీ తాంబూలాలు స్వయంగా ఇచ్చేవాడు. ఆడవాళ్ళు అందరు స్త్రీలకీ బొట్టుపెట్టి, పండు, తాంబూలం ఇచ్చేవారు. ఇప్పుడవేవీ? ఘాటైన మసాలాలతో నిండిన వంటకాలు, ఏవేవో స్వీట్లూ, ఐస్‌క్రీంలూ..., ఒక్కొక్కరు మూడేసి, నాలుగేసి కప్పుల కోసం ఎగబడ్డం-ఇంకొంత మంది ఉండగానే అవి అయిపోయి, మిగిలినవాళ్ళు తిట్టుకుంటూ ఉసూరుమని వెనక్కి తిరగడం. ఇదంతా చూస్తుంటే ఇందుకోసమేనా ఇక్కడికొచ్చేది? అనిపిస్తుందయ్యా'' అన్నాడు శంకరం.

ఇంతలోనే ఎవరో అటుగావచ్చి ''సార్! భోంచేసేరా?'' అని అడిగేడు.

''ఫరవాలేదే, ఆ మాత్రం అడిగేరు'' అనుకుని, ''లేదు'' అన్నారిద్దరూ.

అతను వాళ్ళని తీసుకెళ్ళి ఓ రెండు కుర్చీల దగ్గర నించోబెట్టి, ''మీరిక్కడే ఉండండి సార్! వీళ్ళు లేవగానే కూర్చోండి. వడ్డించేస్తారు. నేనిప్పుడే వస్తాను'' అని ఎటో వెళ్ళిపోయేడు.



'వీళ్ళెప్పుడు లేస్తారో అన్నట్టు పీకలమీద కూర్చోవాలన్న మాట' అనుకున్నాడు మూర్తి. శంకరానికిదేం కొత్తకాదు కాబట్టి, అటూ ఇటూ చూస్తూ నిల్చున్నాడు.

ఇంకో ఐదునిమిషాల్లో రెండు కుర్చీలు ఖాళీ అయేయి. కూర్చున్నారు. ఓ అబ్బాయి టేబిల్‌మీద కాగితంతోసహా ఆకులు తీసేస్తే, ఇంకో అబ్బాయి మరో కాగితం పరిచి, ఆకులు వేసేడు.

''ఇదేంటయ్యా! ఇంతేనా శుభ్రం'' అంటున్న మూర్తితో, ''మరేంటనుకున్నావ్, ఇదేమన్నా మీ పల్లెటూరనుకున్నావా? రోజుల్నిబట్టి మనమూ మారాలయ్యా! కూర్చో'' అన్నాడు.

వడ్డనలు మొదలయ్యాయి. బిర్యానీ, ఉల్లిచట్నీ, నూనె కారిపోతున్న మసాలా కూరలు గబగబా వేసేస్తున్నారు. మాసిన బట్టలతో ఉన్న ఆ కుర్రాళ్ళు, ఆ వడ్డనలు, వంటలు..అంతా మూర్తికి ఏదోలా ఉంది. ఆకలి దంచేస్తోంది. అసలే ఆరోగ్యం అంతంత మాత్రం. వేళకి భోజనం చెయ్యకపోతే అరగదు. అందులోనూ ఈ భోజనం...పోనీ స్వీటన్నా తిందామంటే తినకూడదు. ఊరికే అలా అలా కెలుకుతున్నాడు. గబగబా తినేస్తున్నాడు శంకరం.

గ్లాసుల్లో మంచినీళ్ళు పోస్తున్న ఓ అబ్బాయిని ఓ ఇద్దరు పిల్లలు ఆడుకుంటూ వచ్చి ఢీ కొట్టేరు. ఆ అబ్బాయి నీళ్ళ జగ్గుతోపాటే మూర్తిగారి ఆకుమీదకి ఒరిగిపోయేడు. ఆయన ఆకునిండా, బట్టలనిండా నీళ్ళు..ఆ అబ్బాయి తెల్లబోయి, వెంటనే సర్దుకున్నాడు.

''సారీ సార్! క్షమించండి. మీకు మరో ఆకు వేస్తాను'' అంటుండగానే మూర్తి అందుకుని-

''ఫర్వాలేదులేవోయ్! నా భోజనం పూర్తయింది. నేనే లేద్దామనుకుంటున్నాను.''

అంటూ గ్లాసులో నీళ్ళు గటగటా తాగేసి, ''అన్నదాతా సుఖీభవ'' అంటూ లేచాడు. శంకరం అతన్ని అనుసరించేడు.

''వివాహ భోజనంబు, వింతైన వంటకంబు...'' అంటూ బేండువాళ్ళు అదరగొట్టేస్తున్నారు.

★

కె. రాజేశ్వరి